క్లుప్తంగా

మానవత విద్యానిధికి రూ.25 వేలు విరాళం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ప్రతిభావంతులైన పేద విద్యార్థుల ఉన్నత చదువులకు చేయూత అందించే లక్ష్యంతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటు చేస్తున్న విద్యా నిధికి హనుమాన్‌జంక్షన్‌కు చెందిన కూర్మెళ్ల సుబ్బాచారి రూ.25 వేలు విరాళాన్ని అందజేశారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో నగదును జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు, సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావుకు సుబ్బాచారి మంగళవారం అందజేశారు. మానవత హనుమాన్‌జంక్షన్ శాఖలో వివిధ హోదాల్లో సేవలు అందించిన సుబ్బాచారి తన వంతుగా విద్యానిధికి రూ.25 వేలు విరాళం అందించటంపై మారుబోయిన అభినందించారు. మానవత సభ్యులు గంటా సత్యనారాయణ, ఇందిరా దేవి, జన్యావుల సత్యనారాయణ, పాబోలు గణేష్, వేగిరెడ్డి సూర్యనారాయణ, శేషాచలం, రామచంద్రరావు, వెంకట స్వామి పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యదర్శి విజయ్‌కు సత్కారం



గన్నవరం: స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో మంగళవారం డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు(డీసీఈబీ) కృష్ణాజిల్లా కార్యదర్శిగా నియమితులైన బాపులపాడు ఎంఈఓ-2 కొమ్మా విజయ్‌ను సత్కరించారు. ఆయనకు గుడివాడ ఉప విద్యాశాఖాధికారి కొండా రవికుమార్, ఎంఈఓలు ఎం.కమల, సాంబశివరావు, రాంబాల్‌సింగ్, భానుప్రకాష్ తదితరులు సన్మానించారు.

కౌలురైతులకు అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

కంకిపాడు: కౌలురైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని వర్తింపజేయాలని ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ వి.భావనారాయణను కలిసి మంగళవారం వినతి పత్రం అందజేశారు. హరిబాబు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు తక్షణమే కౌలురైతులకు అందించాలని డిమాండ్ చేశారు. 16 నెలల పాలనలో కౌలురైతులకు ఒరిగిందేమీ లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు అందించాలన్నారు. సంఘం ప్రతినిధులు జె.రవి, వి.మరియదాసు, టి.నరేష్, సీహెచ్ శ్రీహరి, బి.దీపిక, బి.ప్రియాంక, ఎం.ప్రభాకర్‌రావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై వర్క్‌షాపు

పెనమలూరు: కానూరు సిద్ధార్థ డీమ్డ్ టూబీ యూనివర్సిటీలో గుండె ఆగిన సమయంలో సీపీఆర్ నిర్వహించటంపై వర్క్‌షాపు జరిగింది. కాలేజీలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో సీపీఆర్ వీక్ కార్యక్రమంలో భాగంగా పిన్నమనేని సిద్ధార్థ మెడికల్‌కాలేజీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రిజిస్ట్రార్ ఎం.రవిచంద్ర మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి సీపీఆర్‌పై అవగాహన పొందాలన్నారు. గుండె ఆగిన సమయంలో అత్యవసర వైద్యం అందించటానికి సీపీఆర్ ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. మెడికల్ కాలేజీ వైద్య సిబ్బంది సీపీఆర్ చేసే విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ జె.శివరామ్‌ప్రసాద్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు సుష్మాచౌదరి, ఎం.రాజేష్, కాలేజీ వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లీ నరక ప్రయాణం!

- ముందడుగు పడని ఈడుపుగల్లు రోడ్డు అభివృద్ధి
- రూ.3.50 కోట్లు మంజూరైనా నోచుకోని పనులు
- నేటికీ టెండర్ల దశలోనే..
- రాకపోకలు సాగక ప్రజల అవస్థలు
- పట్టించుకోని కూటమి పాలకులు



రాళ్లు తేలి అధ్వానంగా ఉన్న ఈడుపుగల్లు ప్రధాన రహదారి



రహదారిపై భారీ గుంతలు

కంకిపాడు: ఒకటి కాదు రెండు కాదు ఏళ్ల తరబడి నరకం.. రాకపోకలకు నిత్యం అవస్థలు.. అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు చెబుతున్నా ఒక్క అడుగు కూడా ముందుకు సాగని వైనం... టెండర్ల దశ దాటితేనే రోడ్డు అభివృద్ధి జరిగేది..?. కూటమి ప్రభుత్వ వైఫల్యంతో నిత్యం అష్టకష్టాలు పడుతున్న ప్రజానీకం...ఇంకెన్నాళ్లీ నరకం అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్న పరిస్థితి.

విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారికి అనుసంధానంగా కంకిపాడు-గన్నవరం రోడ్డును కలుపుతూ ఉన్న ప్రధాన రహదారి మార్గం ఈడుపుగల్లు - ఉప్పలూరు రోడ్డు మార్గం. గత కొన్నేళ్లుగా ఈ రోడ్డు మార్గం అధ్వానంగా ఉంది. రోడ్డు మార్జిన్లు కోతకు గురై భారీ గుంతలు ఏర్పడ్డాయి. దారి పొడవునా గోతులు, రాళ్లు తేలిన రోడ్డు మార్గమే కనిపిస్తోంది. ఈ మార్గంలో ప్రయాణం అంటేనే వాహనదారులు, సామాన్య ప్రజానీకం హడలెత్తిపోతున్నారు. ఇక వర్షం వస్తే గోతులు నిండా నీరు నిలిచిపోయి గోతులు కనిపించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న ఘటనలు అనేకం.

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన..

గన్నవరం సమీపంలోని ఎయిర్‌పోర్టుకు వెళ్లేందుకు ప్రజలు ఈ మార్గాన్ని అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో పాటుగా ఏలూరు, బందరు రోడ్డు చేరుకునేందుకు దగ్గర మార్గంగా వాడుతున్నారు. దీంతో ఈ రోడ్డుకు ప్రాధాన్యత పెరిగింది. ప్రజల అవసరాల రీత్యా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఈ రోడ్డు మార్గాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న సింగిల్ లైన్ రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు నిర్ణయించింది. మద్దూరు - గోసాల - ఈడుపుగల్లు - ఉప్పలూరు వరకూ రోడ్డుకు రూ.19.50 కోట్లు కేటాయించింది. ఎన్నికల ముందు రోడ్డు శంకుస్థాపన పనులు చేయించింది. ఎన్నికల కోడ్ అమలు, తరువాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావటంతో పనులు పెండింగ్ పడ్డాయి. కూటమి సర్కారు ప్రాధాన్యతలను మరిచి రోడ్డు అభివృద్ధి పనులను రద్దు చేసింది.

టెండర్ల దశలోనే అభివృద్ధి..

ఈ ఏడాది వేసవికి పూర్వమే ఈడుపుగల్లు ఆర్ అండ్‌బీ రోడ్డును సింగిల్ లైన్‌రోడ్డుగా అభివృద్ధి చేసేందుకు రూ.3.50 కోట్లు కేటాయించింది. అప్పటి వరకూ డబుల్ లైన్ రోడ్డు అనుకున్నది సింగిల్ లైన్‌కే పరిమితం చేశారు. అయితే నేటికీ టెండర్ల దశ పూర్తి కాలేదు. ఇంకా పనులు టెండర్ల వద్దే ఆగాయి. వేసవిలో రోడ్డు పనులు పూర్తవుతాయని అంతా భావించారు. కానీ టెండర్లే పూర్తి కాకపోవటం, వర్షాకాలం కూడా పూర్తయి శీతాకాలం రావటం జరిగింది. ఇటీవల కాలంలో అడపా దడపా కురుస్తున్న మోస్తరు నుంచి భారీ వర్షాలకు రహదారి పరిస్థితి మరింత అస్తవ్యస్తంగా తయారైంది. ద్విచక్ర వాహనదారులు సైతం రాకపోకలకు ఇబ్బందులు పడే పరిస్థితి. వాహనదారులు ఈ మార్గం గుండా రాకపోకలు సాగిస్తుంటే ప్రమాదాల బారిన పడటంతో పాటుగా వాహనాలు తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ రోడ్డు మార్గాల వైపు దృష్టి పెడుతున్నారు. ప్రాధాన్యత గల రహదారులను సంక్రాంతికి పూర్తి చేస్తామన్న కూటమి సర్కారు అధికారంలోకి వచ్చి మరో సంక్రాంతి కూడా రాబోతోంది. ప్రభుత్వ అలసత్వం కారణంగానే రోడ్డు పనులు ముందడుగు పడటం లేదన్న వాదన సర్వత్రా వినిపిస్తోంది. ప్రజల ఇబ్బందులను గుర్తించి రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు.



చిన్నపాటి వర్షానికే గుంతలో చేరిన నీరు

టెండర్లు పిలిచాం..

రహదారి నిర్మాణానికి టెండర్లు పిలిచాం. టెండర్ల దశ పూర్తి కాగానే పనులు కేటాయింపులు జరుగుతాయి. త్వరలోనే రోడ్డు పనులు చేపట్టేందుకు అవకాశం ఉంది. ఆ దిశగా శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నాం. కేటాయించిన నిధుల ప్రకారం సింగిల్ లైన్ రోడ్డు పూర్తి చేసేందుకు చర్యలు చేపడతాం.

– మల్లికార్జున, ఏఈ, ఆర్‌అండ్‌బీ, కంకిపాడు

చలివేంద్రపాలెంలో అధికారుల పర్యటన

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెంలోని జగనన్న లే అవుట్‌ను అధికారులు మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ డీకే బాలాజీ పర్యటన ఉందన్న సమాచారంతో అధికారులు ముందస్తుగా లే అవుట్‌ను సందర్శించారు. ఎంపీడీఓ పి.అనూష నేతృత్వంలో అధికారుల బృందం కాలనీని సందర్శించి లబ్ధిదారుల నుంచి వివరాలు సేకరించారు. స్థానికంగా నెలకొన్న సమస్యలు, వసతులపై ఆరా తీశారు. చివరికి కలెక్టర్ పర్యటన వాయిదా పడటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నేడు రిటైర్డ్ ఉద్యోగులకు కంటి, దంత వైద్యశిబిరం

గన్నవరం: స్థానిక బుద్దవరం రోడ్డులోని విశ్రాంత ఉద్యోగుల సేవా భవనంలో బుధవారం ఉచిత కంటి, దంత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు రిటైర్డ్ ఉద్యోగుల సంఘం గన్నవరం తాలుకా యూనిట్ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడకు చెందిన మాక్స్‌విజన్ కంటి ఆస్పత్రి, కృష్ణసాయి దంత వైద్యశాల నేతృత్వంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే వైద్యశిబిరాన్ని గన్నవరం తాలుకా యూనిట్ పరిధిలోని రిటైర్డ్ ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. స్వామి వారికి ప్రీతిపాత్రమైన మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తమలపాకులతో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో 350 మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు. ఆలయ పాలకమండలి చైర్మన్ వేమూరి శ్రీనివాసరావు, సభ్యులు, ఈవో పితాని తారకేశ్వరరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కాలనీల్లో మౌలిక వసతులు కల్పించాలి

కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ



వణుకూరులో స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

పెనమలూరు: ప్రభుత్వ గృహ సముదాయాల్లో (జగనన్న కాలనీలు) మౌలికవసతులు కల్పించాలని అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ డి.కె.బాలాజీ ఆదేశించారు. ఆయన మంగళవారం వణుకూరు, పెనమలూరు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ గృహ సముదాయాలను పరిశీలించారు. వణుకూరులో పర్యటించిన సమయంలో కాలనీల ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. రహదారులు, డ్రెయిన్లు లేక వర్షాకాలంలో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వివరించారు. ఇళ్లు నిర్మించుకునేందుకు అనుకూల వాతావరణం కల్పించాలని కోరారు. కలెక్టర్ బాలాజీ స్పందించి కాలనీల్లో డ్రెయిన్లు, రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని జలవనరులు శాఖ ఈఈ రవికిరణ్, గృహ నిర్మాణ సంస్థ డీఈ శివప్రసాదరావుకు సూచించారు. పెనమలూరు కాలనీ వాసులు కూడా రహదారులు, డ్రెయిన్లు నిర్మించాలని కోరారు. పంట పొలాల్లో నీరు కాలనీలోకి వస్తోందని, విషకీటకాల సంచారంతో భయంగా ఉందని వివరించారు. కాలనీల్లో వసతులు కల్పించడానికే తాను పర్యటిస్తున్నానని, సమస్యలు పరిష్కరిస్తానని కలెక్టర్ బాలాజీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ ఎస్.పోతురాజు, ఈఈ బుచ్చిబాబు, తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీఓ బండి ప్రణవి, విద్యుత్‌శాఖ ఏఈ సూర్యనారాయణరావు, హౌసింగ్ ఏఈ జిలానీ పాల్గొన్నారు.

లింగ వివక్ష నిర్మూలనకు కృషి చేయాలి



పెనమలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థినులు

పెనమలూరు: లింగ వివక్షత నిర్మూలనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీబీకే సుధారాణి చెప్పారు. పెనమలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ.. బాలికలకు సమాజం అండగా నిలవాలన్నారు. లింగ వివక్ష లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పీహెచ్‌సీ హెల్త్ విజిటర్(హెచ్‌వీ) నిర్మల మాట్లాడుతూ బాలికల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించాలన్నారు. అబ్బాయిలు, అమ్మాయిలు సమానమేనని తెలిపారు. నేడు బాలికలు ఉన్నత చదువులు చదవటానికి చక్కని అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీహెచ్‌వో లక్ష్మయ్య, ఎంఎల్‌హెచ్‌పీ షైనీ, ఉపాధ్యాయులు డీవీ సుబ్బారావు, విజయలక్ష్మి, వైద్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఆగిరిపల్లి - గన్నవరం రహదారి నిర్మాణం పూర్తి చేయాలి



గన్నవరంరూరల్: అధ్వానంగా ఉన్న ఆగిరిపల్లి - గన్నవరం రహదారిని బాగు చేయాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం మండలంలోని గొల్లనపల్లిలో సంతకాల సేకరణ నిర్వహించింది. గన్నవరం నుంచి ఆగిరిపల్లి వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ సంతకాలు సేకరించారు. ఈ రహదారి నిర్మాణం ఆలస్యం కావడంతో అనేక ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఈ సమస్యను పట్టించుకోవాలని గతంలో ఐక్యవేదిక పాదయాత్ర చేసి నిరసన తెలియజేసిందని, అయినా ప్రభుత్వంలో మార్పు లేదని విమర్శించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించి అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయించామన్నారు. పరిష్కారం చేయకపోతే ఆందోళనలు తీవ్రం చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నాయకులు కళ్ళం వెంకటేశ్వరరావు, కొలనుపాక శివాచారి, పలగాని సాంబయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు

పెనమలూరు: యనమలకుదురులో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్‌కు గాయాలు కావటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో తిరుపతి మల్లేశ్వరి, ఆమె భర్త ఆటో డ్రైవర్ సుధీర్‌బాబు, కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. అయితే ఆమె భర్త సోమవారం ఇంటి నుంచి బయటకు వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన బైక్ ఢీ కొంది. ఈ ఘటనలో గాయపడిన సుధీర్‌బాబును విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్సకు చేర్చారు. బాధితుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పోలవరం కాల్వ పరిసరాల్లో ఆక్రమణలు తొలగించాలి



పోలవరం కాల్వ స్థలంలో కట్టడాలు

విజయవాడరూరల్: నున్న, పాతపాడు గ్రామాల్లో పోలవరం కాల్వ ప్రభుత్వ స్థలాల్లో అక్రమ కట్టడాల తొలగింపునకు రెవెన్యూ అధికారులు సహకరించాలని పోలవరం డీఈ నీరజ రూరల్ తహసీల్దార్ బి.సుగుణను కలిసి విజ్ఞప్తి చేశారు. పోలవరం కాల్వను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాల్లో భారీ కట్టడాలు నిర్మిస్తున్నారని వాటిని వెంటనే తొలగించాలని పలు దఫాలు చెప్పినా పట్టించుకోవడం లేదని డీఈ తహసీల్దార్‌కు తెలియజేశారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలు తొలగించడానికి అధికారులు సహకరించాలని డీఈ లేఖను అందించారు. ఆక్రమణల తొలగింపునకు సహకరిస్తామని తేదీ నిర్ణయించి తెలియజేయాలని తహసీల్దార్ డీఈకి తెలిపారు. అనంతరం ఎంపీడీఓ బి.విగ్గీస్‌ను కలిసి ఆక్రమణలపై చర్చించారు. గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులను ఆక్రమణల తొలగింపునకు సహకరించే విధంగా తగిన ఆదేశాలు ఇవ్వాలని కోరారు. అధికారులకు అక్రమ కట్టడాలకు సంబంధించిన ఫొటోలను చూపించారు. అధికారులను కలిసిన వారిలో డీఈ, ఏఈ ఉన్నారు.

పర్యావరణానికి హానీ కలిగించే ప్లాస్టిక్‌ను నియంత్రించాలి

పొట్టిపాడు(గన్నవరం): ఉంగుటూరు మండలం పొట్టిపాడు గ్రామంలో మంగళవారం ఉషారామ ఇంజినీరింగ్ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. ఇంటి వద్దే తడి, పొడి చెత్తను వేరు చేయడం, ప్లాస్టిక్ స్థానంలో పునర్వినియోగ వస్తువుల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ వి.శ్రీహరిబాబు మాట్లాడుతూ.. నానాటికి పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర హానీ జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజలు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని, వీటి స్థానంలో జ్యూట్, వస్త్రం, లోహం, గాజు వంటి పునర్వినియోగ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. పొట్టిపాడును ప్లాస్టిక్ ఫ్రీ విలేజ్‌గా మార్చడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించాలని వినతి

గన్నవరం: స్థానిక ఎస్సీ కాలనీలో మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మంగళవారం కాలనీవాసులు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి విజ్ఞప్తి చేశారు. కాలనీలో అస్తవ్యస్త డ్రెయినేజీ వ్యవస్థ వల్ల మురుగునీటి పారుదల సక్రమంగా జరగడం లేదన్నారు. దీనివల్ల వర్షం కురిసినప్పుడు ఇళ్లలోని మురుగునీరు సీసీ రోడ్డుపై నిలుస్తుందన్నారు. దీని వల్ల తీవ్ర దుర్గంధం వస్తుండడంతో పాటు దోమల వ్యాప్తి చెందుతున్నాయని తెలిపారు. మురుగునీటి వల్ల సిమెంట్ రోడ్డు ఉన్నప్పటికి నడవ లేని పరిస్థితి నెలకొందన్నారు. ముఖ్యంగా స్కూల్‌కు వెళ్లే పిల్లలు, స్త్రీలు, వృద్ధులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యను పలు మార్లు గ్రామపంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా మురుగునీటి క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజారోగ్యంపై జీఎస్టీ గిఫ్ట్



పెనమలూరు: ప్రజారోగ్యంపై సూపర్ జీఎస్టీ 2.0 గిఫ్ట్‌ను కేంద్ర ప్రభుత్వం ఇచ్చిందని తాడిగడప కమిషనర్ షేక్.నజీర్ తెలిపారు. పోరంకిలో మంగళవారం జీఎస్టీపై కమర్షియల్ ట్యాక్స్ శాఖ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆరోగ్య బీమా, వివిధ రకాల మందులు, వ్యాధి నిర్ధారణ కిట్లు, దృష్టి సంబంధిత కళ్లద్దాలు, 16 రకాల ప్రాణాంతక వ్యాధుల మందులపై జీఎస్టీ తగ్గించారన్నారు. ప్రజలు తగ్గిన ధరలపై వివరాలు తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కమర్షియల్ డిపార్టుమెంట్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీమాధవి, మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ డి.కిరణ్‌కుమార్, స్థానికులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

పెనమలూరు: పెనమలూరులో వ్యక్తి పై దాడి చేసిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా దెందులూరుకు చెందిన ఫిర్యాది జె.సింహాచలం విజయవాడ కృష్ణలంకకు చెందిన మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమార్తె. దంపతులకు గొడవలు జరగటంతో భార్య పుట్టింటికి వచ్చి ఉంటోంది. సింహాచలం భార్య పెనమలూరుకు చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుందని తెలిసి ఫిర్యాది ఆ వ్యక్తిని నిలదీశాడు. దీంతో ఆ వ్యక్తి సింహాచలంపై దాడి చేయడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సీఆర్డీఏ పనితీరు అవినీతి మయం

- మాస్టర్ ప్లాన్ రోడ్డులో భవన నిర్మాణాలకు అనుమతి
- అధికారులు ప్రశ్నించిన పురపాలక ప్రజలు
- క్షేత్రస్థాయి పరిశీలన లేకుండా మాస్టర్‌ప్లాన్ సమావేశం



సీఆర్‌డీఏ అధికారి దివ్యను ప్రశ్నిస్తున్న స్థానికులు

పెనమలూరు: ఏపీ సీఆర్డీఏ అధికారుల అవినీతి కారణంగా జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో చూపిన రహదారులపైనే భవన నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని, ఈ కారణంగా మాస్టర్‌ప్లాన్ ఎలా అమలు చేయగలుగుతారని స్థానిక ప్రజలు సీఆర్డీఏ అధికారులను నిలదీశారు. పోరంకిలో మంగళవారం తాడిగడప మున్సిపాలిటీకి మాస్టర్ ప్లాన్ రూపొందించటానికి సీఆర్‌డీఏ సహకారంతో ఆర్వీ అసోసేట్స్ ఆర్కెటిక్స్ ఇంజినీర్స్ సంస్థ సమావేశం నిర్వహించింది. మున్సిపాలిటీ ప్రజలు సూచనలు, సలహాలు, ప్రతిపాదనలు తెలిపితే 2047 సంవత్సరం నాటికి తాడిగడప మున్సిపాలిటీ అభివృద్ధి చేయటానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. అయితే సమావేశానికి వచ్చిన ప్రజలు ఏపీ సీఆర్డీఏ పని తీరుపై తీవ్ర అభ్యంతరం తెలిపారు. గతంలో ఆమోదించిన జోనల్ డెవలప్‌మెంట్ ప్లాన్‌లో చూపిన రోడ్లపై సీఆర్డీఏ అధికారులు భవనాల నిర్మాణానికి ప్లాన్‌లు మంజూరు చేసి అనుమతులు ఇచ్చారని స్థానికుడు వెలగపూడి బాబూరావు ప్రశ్నించారు. యనమలకుదురులో మాస్టర్ ప్లాన్ రోడ్డులో 40 భవనాల నిర్మాణాలు జరిగాయని, తాను సీఆర్డీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు ప్రతిపాదిత రోడ్లపై ఉన్న భవనాలను ఏమి చేస్తారని ప్రశ్నించారు.

భవన నిర్మాణాలకు ఎలా అనుమతిచ్చారు..

ఎమ్మెల్యే బోడె ప్రసాద్ మాట్లాడుతూ సనత్‌నగర్‌లో మాస్టర్ ప్లాన్ రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టగా రోడ్డుపై అపార్ట్‌మెంట్ నిర్మాణం జరిగిందన్నారు. భవన నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. సీఆర్డీఏ అధికారులు ప్లాన్ మంజూరులో సమస్యలు రాకుండా చూడాలన్నారు. మాస్టర్ ప్లాన్ సమావేశం ఏర్పాటు చేసిన సంస్థ ప్రతినిధులు తాడిగడప మున్సిపాలిటీ వివరాలు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేయటంపై సమావేశానికి వచ్చిన వారు తీవ్ర అభ్యంతరం తెలిపారు. స్థానికులు పలు కీలక ప్రశ్నలను అధికారులకు సంధించారు

క్షేత్రస్థాయిలో పర్యటిస్తాం

2047 మాస్టర్ ప్లాన్ రూపొందించటానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. మున్సిపాలిటీ, పంచాయతీ అధికారులతో పాటు స్థానికుల సహకారంతో పర్యటించి అభిప్రాయ సేకరణ చేస్తామన్నారు. సంస్థ ప్రతినిధులు పూర్తి సమాచారంతోనే సమావేశం నిర్వహించాలని సీఆర్డీఏ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్డీఏ జాయింట్ డైరెక్టర్ కె.దివ్య, డెప్యూటీ డైరెక్టర్ భాస్కర్, తాడిగడప కమిషనర్ షేక్.నజీర్, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ అధికారులు శ్రీలక్ష్మి, కె.అరుణ, పుర ప్రముఖులు, బిల్డర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు అవార్డు



ఢిల్లీలో అవార్డు అందుకుంటున్న పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్

రామవరప్పాడు: నిడమానూరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు కోఎడ్ డేమ్ బోర్డింగ్ పాఠశాలల విభాగంలో రాష్ట్రంలో మొదటి ర్యాంకు, ఆల్ ఇండియాలో 19వ ర్యాంకు సాధించింది. ఈ అవార్డును ఢిల్లీలోని ఎడ్యుకేషనల్ వరల్డ్ వారి చేతుల మీదుగా మంగళవారం పాఠశాల డైరెక్టర్ పరిమి పవన్ చంద్, శ్వేత బింధు దంపతులు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రొ.వైస్ చైర్మన్ పరిమి నరేంద్రబాబు మాట్లాడుతూ.. ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ నిర్వహించిన సర్వేలో పాఠశాలకు ర్యాంకు రావడం అభినందనీయమన్నారు. కేవలం ఉన్నత విద్యకే పరిమితం కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధిపై దృష్టి సారిస్తూ నైపుణ్యాలు పెంపొందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. నైతిక విలువలతో కూడిన విద్యాభ్యాసమే ఈ విజయానికి కారణమన్నారు. పాఠశాల డైరెక్టర్ కడియాల ప్రవీణ్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు.

వికాస్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్



నున్న(విజయవాడ రూరల్): నున్న గ్రామంలోని వికాస్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజీలో ఎంఎస్‌ఎంఈ ఆధ్వర్యంలో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కమ్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ.. నేటి విద్యార్థులు ఉద్యోగాల కోసం వెతకడం కాకుండా, ఉద్యోగాలను సృష్టించే వారిగా ఎదగాలన్నారు. విద్యార్థులకు నేటి పరిశ్రమ అవసరాల ప్రకారం అవసరమైన నైపుణ్యాలను వివరించారు. విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలను సాకారం చేసుకునేందుకు ఎంఎస్‌ఎంఈ ద్వారా ఐడియాధాన్ వంటి పథకాలను వినియోగించుకోవాలన్నారు. 20 రోజుల పాటు ప్రోగ్రామ్స్‌ను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సీవీఎస్ పరమేశ్వరరావు, డైరెక్టర్ కీర్తి, కాలేజీ చైర్మన్ ఎన్.నర్సిరెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.